క్లుప్తంగా

ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని వినతి

మంచిర్యాలఅర్బన్: అగ్నిమాపక నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేట్ ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అగ్నిమాపక అధికారి దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫైర్ సెఫ్టీ లేకుండా ఇష్టానుసారంగా ఫీజులు దండుకుంటూ ఐటీఐలు నిర్వహిస్తున్నారని దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, వంశీ, ప్రసాద్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టుకునేందుకు అనుమతి

చెన్నూర్: పట్టణంలోని పెద్ద చెరువు, అయ్యవారికుంట, కొత్త చెరువులలో చెన్నూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వారికి చేపలు పట్టుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 24నుంచి 30వరకు మూడు చెరువులలో చేపలు పట్టుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంఘంలో ఉన్న సభ్యులు మాత్రమే చేపలు పట్టుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

'సినీగేయ సాహిత్యం సులువు కాదు'

మంచిర్యాలఅర్బన్: సినీగేయ సాహిత్యం సులువైంది కాదని, శ్రోతులకు అనేక మార్లు వినేలా అత్యంత మేథోమథనం చేసి గీతాలు రచిస్తారని సినీ విశ్లేషకుడు తుమ్మల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మంచిర్యాలలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో తెలుగు సినీ గేయ సాహిత్యంపై ప్రసంగించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. కవి సమ్మేళనంలో తోకల రాజేశం, రాజిరెడ్డి, నాగవర్మ, బోలిశెట్టి నాగేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

30లోపు యూనిఫాంలు అందించాలి



మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న మారుతీప్రసాద్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం తరుపున అందించే రెండు జతల యూనిఫాంలను ఈ నెల 30వ తేదీలోపు కుట్టి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్ అన్నారు. మంచిర్యాల మెప్మాలోని మహిళా సంఘ సభ్యులకు గాను రెండు జతల యూనిఫాంలను కుట్టి ఇచ్చేందుకు 30ప్రభుత్వ పాఠశాలల్లోని 4,032మంది విద్యార్థుల యూనిఫాంలను కుడుతున్నారు. కమిషనర్ మహిళా సభ్యులు కుడుతున్న యూ నిఫాంలను గురువారం ఆయన పరిశీలించి, తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మెప్మా చంద్రయ్య, అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

మండలస్థాయి క్రికెట్ పోటీలు

జన్నారం: కవ్వాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అంజత్ ఖాన్ స్మారకార్థం అతడి తమ్ముడు అక్రం ఖాన్ నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలను గురువారం మండల కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్ ప్రారంభించారు. పలు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి షీల్డు, రూ.10వేలు నగదు, రెండో బహుమతి రూ.5వేలు, షీల్డు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సక్రునాయక్, శాఖీర్ అలీ, మహేశ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

దండేపల్లి: ఈ నెల 24నుంచి 31వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు దండేపల్లిలో గురువారం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శోభ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దండేపల్లిలో ప్రథమ సంవత్సరంలో 136, ద్వితీయ సంవత్సరంలో 38మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

బస్టాండ్‌లో నీటి గోస

- కంపు కొడుతున్న మరుగుదొడ్లు, మూత్రశాలలు
- చల్లని తాగునీరు కొనుక్కోవాల్సిందే..
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బెల్లంపల్లి బస్టాండ్

బెల్లంపల్లి: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ చార్జీలతో పాటు, బస్టాండ్లలో సౌకర్యాల కల్పనకు, వసతుల కల్పనకు చార్జీలు వసూలు చేస్తున్న యాజమాన్యం సౌకర్యాల కల్పన విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో బస్టాండ్లలో కనీసం మరుగుదొడ్లను కూడా నిర్వహించడం లేదు. ఇక ప్రయాణికులకు తాగునీరు దొరకని పరిస్థితి. నల్లాల నుంచి వచ్చే వేడినీటినే తాగుతున్నారు. నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. ప్రయాణికులు పడుతున్న కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు.

బెల్లంపల్లి బస్టాండ్‌లో సమస్యలు..



ప్రస్తుతం ఎండలు మండి పోతున్నాయి. అవసరాల రిత్యా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సాగిస్తున్న ప్రయాణికులు బెల్లంపల్లి బస్టాండ్‌లో దిగితే తాగడానికి నీళ్లు దొరకడం లేదు. బస్టాండ్ ఆవరణలో ఉన్న ట్యాప్ ఆన్ చేస్తే అందులో నుంచి వేడి నీరు వస్తోంది. వాటిని తాగలేకపోతున్నారు. చల్లని నీరు కావాలంటే కొనుగోలు చేయాల్సిందే. ఇవి కూడా బస్టాండ్‌లో అందుబాటులో ఉండడం లేదు.

కంపు కొడుతున్న మరుగుదొడ్లు

ఇక అత్యవసరంగా ఒంటికి, రెంటికి వెళ్లడానికి వీలు లేని పరిస్థితి. మూత్రశాల, మరుగు దొడ్లకు సరిపడ నీటి సరఫరా జరగడం లేదు. దీంతో అత్యవసరాలు తీర్చుకోవడానికి ప్రయాణికులు అగచాట్లు పడుతున్నారు. పురుషులు బస్టాండ్ ఆవరణలో ఉన్న చెట్ల పొదల మాటున మూత్ర విసర్జనకు వెళుతుండగా, అనివార్య పరిస్థితుల్లో



మహిళలు, చిన్నారులు నీళ్లులేని మూత్రశాలకు వెళ్లాల్సివస్తోంది. దీంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. మరోపక్క మరుగుదొడ్లకు తలుపులు లేవు.

నిత్యం వేల మంది ప్రయాణం..

ఈ బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. వేమనపల్లి, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట మండలాలతోపాటు దహెగాం, తిర్యాణి మండలాల ప్రయాణికులకు బెల్లంపల్లి బస్టాండే ప్రధానమైంది. ఇక్కడి నుంచి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, భూపాలపల్లి ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతోంది.

పర్యవేక్షణ కరువు..

బస్టాండ్ నిర్మించి 33 ఏళ్లయింది. 1991లో కుమురంభీమ్ ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు అనుబంధంగా బస్టాండ్ నిర్మించారు. ఇన్నేళ్లలో బస్టాండ్ స్థితిగతులు ఏమాత్రం మారలేదు. సమస్యలు పరిష్కారం కాలేదు. సమస్యల పరిష్కారానికి అటు ఆర్టీసీ అధికారులు కానీ, ఇటు ప్రజా ప్రతినిధులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

సింగరేణి అధికారులతో మాట్లాడుతున్నాం

బస్టాండ్‌కు నీటి సరఫరా కోసం ఎప్పటికప్పుడు సింగరేణి అధికారులతో సంప్రదింపులు చేస్తున్నాం. ఎండాకాలం కావడంతో నీటి సరఫరాకు ఇక్కట్లు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతానికి నిత్యం ఉదయం పూట నీటి సరఫరా జరుగుతోంది. బస్టాండ్‌లో స్టాల్స్ ఏర్పాటు కోసం ఎన్నిసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రయాణికులు నీటికోసం ఇబ్బంది పడకుండా చూస్తాం.

– బి.విశ్వనాథ్, డిపో మేనేజర్, ఆసిఫాబాద్

తాండూర్‌లో బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు



బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- మండుటెండలో ప్రయాణికుల ఇక్కట్లు

తాండూర్: బస్సు ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. బస్‌షెల్టర్ లేక మండుటెండలో పడరాని పాట్లు పడుతున్నారు. తాండూర్ మండల కేంద్రం నాలుగు మండలాలకు కూడలిగా ఉన్నప్పటికీ ఎన్నో ఏళ్లగా నెలకొని ఉన్న బస్సు షెల్టర్ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. మంచిర్యాల–చంద్రపూర్ ఫోర్‌లైన్ రహదారి పనులు పూర్తయినప్పటికీ మండల కేంద్రంలో నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా అధికారులు ఇప్పటికీ బస్ షెల్టర్లను ఏర్పాటు చేయలేదు. దీంతో తీవ్రమైన ఎండలో సైతం ప్రయాణికులు రోడ్డుకిరువైపులా నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఇబ్బంది అయితంది..

తాండూర్, ఐబీ సెంటర్‌లో బస్టాండ్ లేక అందరికీ ఇబ్బంది అయితంది. ఆడోళ్లు, చిన్నపిల్లలు కూర్చునే జాగలేక అవస్థలు పడుతన్నరు. లీడర్లు, ఆఫీసర్లు ఈ విషయంపై ఆలోచన చేసి రోడ్డుకు రెండు దిక్కుల బస్టాండ్లు ఏర్పాటు జెయ్యాలే.

– ఆదే జంగు, మాదారం, తాండూర్

'మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేదిలేదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: మంత్రి శ్రీధర్‌బాబుపై బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ చేసిన వ్యక్తిగత ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు చెన్నూరి శ్రీధర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోమాస శ్రీనివాస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి వ్యాఖ్యలు పునారావృతం అయితే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్, పాతర్ల నాగరాజు, కరీం, అన్వర్, సుమంత్, రవి, బాపురెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న మోకుదెబ్బ నాయకులు

జన్నారం: జాతీయ స్థాయి గేట్ పరీక్షలో 181ర్యాంకు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థి మెరుగు అన్వేష్‌గౌడ్‌ను గురువారం మోకుదెబ్బ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ నాయకుడు శ్రీనివాసగౌడ్, డివిజన్ అధ్యక్షుడు నర్సగౌడ్, పట్టణ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వారం రోజులు గా జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి పద్మావతిల కల్యాణం ప్రధానార్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యుల ఆధ్వర్యంలో 108మంది జంటల మధ్య కనుల పండువగా జరిపించారు. మహా పూర్ణాహుతి నిర్వహించి ఆలయప్రాంగణంలో ఏరియా జీఎం మనోహర్ సవిత సమక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోనేరు(పుష్కరిణి)లో స్వామి వారి ప్రతిమకు అర్చకులు నరసింహాచార్యులు చక్రస్నానం చేయించారు. శణ్ముఖశర్మ శిష్య బృందం మంత్రోత్సరణ ఆకర్శణగా నిలిచింది.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

పాతమంచిర్యాల: మంచిర్యాల గోదావరి నదీ తీరంలోని శ్రీ గౌతమేశ్వర ఆలయంలో, శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా మంచిర్యాల వాసవీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో 21 జంటలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. వ్రతాలు చేసుకున్న భక్తులకు పూజా సామగ్రితో పాటు అన్నప్రసాద కార్యక్రమాన్ని బజ్జూరి శ్రీవాణి శ్రీనివాస్ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు శ్రీదేవి, ప్రోగ్రాం చైర్మన్ పడకంటి శ్రీనివాస్, వాసవీయూత్ క్లబ్ అధ్యక్షుడు తాటిపల్లి సాయివర్ధన్, జోన్ చైర్‌పర్సన్ నల్మాస్ ప్రవీణ్, నాయకులు చిలువేరు మహేష్, పల్లెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖి బుద్ధ జయంతి



కాసిపేట: మండలంలోని దేవాపూర్ అంబేద్కర్ భవన్‌లో బుద్ధుడి వైశాఖ బుద్ధ జయంతి ఉత్సవం గురువారం అంబేద్కర్ యువజన సంఘం బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఎం.21 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుద్ధుడి విగ్రహం ముందు పూలు సమర్పించారు. సొసైటీ మహిళా అధ్యక్షురాలు రజినిపలేకర్ ఆధ్వర్యంలో బుద్ధవందనం చేశారు.

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుద్ధుని జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడవాలని కోరారు. అనంతరం బుద్ధుని ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు రాజు, సభ్యులు మొగిళి, కిరణ్, ఉదయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఆలయంలో ప్రత్యేక పూజలు



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండలోని అత్యంత ప్రాచీన దేవాలయమైన సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, అర్చక బృందం ఆధ్వర్యంలో ఆలయంలో అభిషేక కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలు, అర్చనా కార్యక్రమాలు వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా జరిపారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 10–30 గంటల ప్రాంతంలో సీతారామచంద్రస్వామి, రాజరాజేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక రథాల్లో ప్రతిష్ఠింపజేసి గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా హనుమత్ యజ్ఞ హోమం



యజ్ఞంలో పాల్గొన్న స్వాములు

రామకృష్ణాపూర్: పట్టణంలోని విజయ గణపతి దేవాలయంలో గురువారం మహా హనుమత్ యజ్ఞ హోమంను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ మాల ధరించిన స్వాములు యజ్ఞంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సతీష్ శర్మ, గురుస్వామి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు.



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ధాన్యం కొనుగోలు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లిరూరల్: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల, బట్వాన్‌పల్లి గ్రామాల్లోని ధాన్యం కుప్పలను, కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ.. వరికోతలు అయి నెలలు గడుస్తున్నా, ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ సంచులు అందుబాటులో ఉంచి, తరుగు లేకుండా ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేపట్టి, సన్న, దొడ్డు రకం ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోమాస అశోక్, మండల సీనియర్ నాయకులు చల్లూరి దేవదాస్, గోమాస బాపు, తిరుపతి, శ్రీకాంత్, శంకర్, రైతులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ పక్కన చెత్త



మంచిర్యాలటౌన్: పట్టణంలోని రైల్వే ట్రాక్ పక్కనే దుకాణదారులు చెత్తను వేస్తున్నారని, వారిపై మున్సిపల్ చట్ట ప్రకారంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ సురేశ్ బల్దువా గురువారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. 31వ వార్డులో ఎక్కువగా దుకాణదారులు ఉండగా, రాత్రి సమయాల్లో చెత్తను వేస్తే, ఉదయం మున్సిపల్ ట్రాక్టర్ల ద్వారా చెత్తను తొలగించిన తరువాత మరోసారి చెత్తను ట్రాక్ పక్కన వేసి ఇబ్బంది పెడుతున్నారని, వారికి జరిమానా విధించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన



పల్లె ప్రకృతివనం వద్ద అధికారులు

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట గ్రామంలో పల్లెప్రకృతి వనం, క్రిమీటోరియమ్, నర్సరీలను కేంద్ర బృందం గురువారం పరిశీలించారు. గ్రామంలోని ప్రభుత్వం నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై ఆరా తీసి అధికారులతో మాట్లాడారు. చెత్త డంపింగ్‌యార్డ్, మురుగు కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామంలోని మురికి కాల్వలు, పాఠశాలలు, ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలను పనుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, ఎంపీడీవో సరోజ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పట్టణ ప్రగతి నిధులు వృథాయేనా...?



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీకి వచ్చే పట్టణ ప్రగతి నిధుల నుంచి హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్డు మధ్యలో గల డివైడర్‌ను స్టీల్ పైపులు వేసి సుందరీకరించేందుకు గాను రూ. 15 లక్షలు ఖర్చు చేశారు. కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు స్టీల్ పైపులను దొంగిలించి తీసుకు వెళ్తున్నా, మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో స్టీల్ పైపులన్నింటినీ దొంగిలించే అవకాశం ఉండగా, కనీసం ఉన్న వాటినైనా కాపాడేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

జైపూర్: మండలంలోని పౌనూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుర్గం మల్లేశ్ తండ్రి భానయ్య ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజారమేశ్ గురువారం పరామర్శించారు. మిట్టపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు జాగటి వెంకటస్వామిపై అక్రమంగా కేసు నమోదు కాగా ఆయన ఇంటికి వెళ్లి ధైర్యాన్ని చెప్పారు.

నియామకం

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలో జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కే. శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు రేగుంట ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఆపరేటర్ కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీరాంపూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీరాంపూర్ కాలనీకి చెందిన కేబుల్ ఆపరేటర్ భాస్కర్ వెంకటేష్ కుటుంబానికి తోటి కేబుల్ ఆపరేటర్లు ఆర్థిక సాయం అందించారు. శ్రీరాంపూర్ వాటర్ ట్యాంక్ ఏరియాలోని ఆయన ఇంటి వద్ద ఆపరేటర్లు అంతా కలిసి పోగు చేసిన రూ.21,250లను గురువారం వెంకటేష్ కుటుంబానికి అందించారు.

అంబలి పంపిణీ

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గుండ్లపాడు, దుబ్బగూడం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు ఆదివాసీ సేన వర్కింగ్ ప్రెసిడెంట్ పేంద్రం శంకర్ ఆధ్వర్యంలో గురువారం రాగి అంబలి పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ఎండ తీవ్రతను తట్టుకుంటూ జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలని తెలిపారు.

షీ టీంలపై అవగాహన



నస్పూర్: నేటి సమాజంలో షీ టీం లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని షీ టీం సభ్యులు తెలిపారు. నస్పూర్ కాలనీలోని సేవాభవన్ కరాటే కోచింగ్ సెంటర్‌లో షీ టీం సభ్యులు విద్యార్థులకు షీ టీంలపై గురువారం అవగాహన కల్పించారు.